# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 30 బుధవారం 2024


వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 103

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





ఫ్యూచర్ సిటీకి వేగంగా కసరత్తు




## దీపావళి వేడుకలు అయోధ్య సిద్ధం

సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్'

లక్షలాది దీపాలు వెలిగించాలని నిర్ణయం




## ఆరురోజులు తరువాత మెరుగుపడిన గాలిలో నాణ్యత



# 70 ఏళ్లు పైబడ్డ వారికి ఆయుష్మాన్ భారత్

## పథాకాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

## ఢిల్లీ, బెంగాల్లో అమలు చేయకపోవడంపై విచారం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ-విన్ పోర్టల్ ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు కోట్లమంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు వైద్య సదుపాయం పొందుతారు. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు. పథకంలో లబ్ది పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్‌లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ..రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ను ఢిల్లీ , పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లో 70 ఏళ్లు దాటిన వారికి సేవలందించ లేకపోతున్నందుకు వారికి తాను క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు. ఆయుష్మాన్ యోజనలో ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేరలేదనీ, రాజకీయ వృత్తికి సంబంధించిన అడ్డుగోడల కారణంగా వారికి తాను సేవ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ప్రజల ప్రయోజనాలను రాజకీయాల కోసం పణంగా పెట్టడం మానవత్వం అనిపించుకోదని హితవు పలికారు. వైద్య చికిత్స కోసం ఇళ్లు, భూములు, నగలు అమ్ముకున్న సందర్భాలు గతంలో చాలానే ఉండేవని, తీవ్రమైన వ్యాధుల విషయంలో అయితే చికిత్సకు అయ్యే ఖర్చు వింటేనే పేద ప్రజలు వణికిపోయే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. పేద ప్రజలను వైద్యం చేయించుకోలేని నిస్సహాయత నుంచి బయటకు తీసుకురావాలనే ఆలోచన నుంచే ఆయుష్మాన్ బారత్ పథకం పుట్టిందని చెప్పారు.




# దీపావళి ముందు జన్వాడలో సారాబుడ్లు

- మూసీ సునరుజ్జీవ ప్రాజెక్ట్ కోసం వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- సమయం వచ్చినప్పుడు మూసీ ప్రాంతంలో పాదయాత్రచేస్తా
- నవంబర్ 1న మూసీ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తాం
- మల్లన్న సాగర్ నుంచి హిమాయత్ సాగర్‌కు నీటి తరలింపు
- త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం
- హైడ్రావల్ల రియల్‌ఎస్టేట్ పడిపోయిందన్న వాదన తప్పు
- దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత
- 10 నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాది
- అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను
- ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తాం

దీపావళి ముందు జన్వాడలో సారాబుడ్లు మద్యంతో కెటిఆర్ దీపావళి వేడుకలు దావత్ అయితే క్యాసినో కాయిన్స్ ఎలా వచ్చాయి తప్పు చేయకుంటే రాజ్ పాకాల ఎందుకు తప్పించుకున్నారు ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ విచారణ విషయంలో కక్షసాధింపు ఉండదు మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ




## ఎనుముల కాదు..ఎగవేతల రేవంత్ రెడ్డి

ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం

దేవుళ్లపై ఒట్టేసి..మాట తప్పితే రాష్ట్రానికి అరిష్టం

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

వనపర్తి సభలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

## కేటీఆర్ లీగల్ నోటీసులకు

### బండి సంజయ్ కౌంటర్ నోటీసులు



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం(అక్టోబర్ 29) రిప్లై ఇచ్చారు. లీగల్ నోటీసుకుగాను కేటీఆర్‌కు కౌంటర్ నోటీసు పంపించారు. తాను చేసిన వ్యాఖ్యల్లో ఎక్కడా తప్పులేదని బండిసంజయ్ తన రిప్లైలో స్పష్టం చేశారు.రాజకీయ విమర్శలకు లీగల్ నోటీసు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. లీగల్ నోటీసు అంటూ బెదిరిస్తే భయపడేది లేదన్నారు. తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని కేటీఆర్‌ను కోరారు. కేటీఆర్ తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కాగా, ఇటీవల బండి సంజయ్ గ్రూప్ వన్ అభ్యర్థులతో కలిసి ఆందోళనల్లో పాల్గొని అరెస్టయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బండి సంజయ్‌ని చర్చలకు పిలిచారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ చదువులేని బండిసంజయ్‌ని గ్రూప్‌వన్‌పై చర్చలకు పిలిస్తే ఏం లాభం అని విమర్శించారు. రేవంత్, బండి సంజయ్ కలిసి డ్రామా చేస్తున్నారని ఆరోపించారు.దీనికి ఆగ్రహించిన బండి సంజయ్ కేటీఆర్‌పై వ్యక్తిగతంగా పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకుగాను బండిసంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

# అంతా కల్తీ.. అంతంతే తనిఖీ



హైదరాబాద్: హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన పట్టణాల్లో రహదారులపై ఎటు వైపు చూసినా పదుల సంఖ్యలో తోపుడుబండ్లు..ఫుడ్ ట్రక్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లే కన్పిస్తాయి. వాటిలో కనిపించే రంగురంగుల తినుబండారాలు నోరూరిస్తాయి. అయితే అక్కడ అమ్మే ఆహార పదార్థాల్లో నాణ్యత ఎంత? వాటిని ప్రమాణాల ప్రకారమే తయారుచేశారా? వాటిలో వాడే రంగులు, మసాలాలు ఆరోగ్యకరమైనవేనా? అనేది మాత్రం ప్రశ్నార్థకమే. ఆయా ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన, తనిఖీలు నిర్వహించాల్సిన ఆహార పరిరక్షణ విభాగం అధికారులు బాధ్యతను విస్మరించడంతో విక్రయదారులు చెలరేగిపోతున్నారు. రాజధాని నగరం నడిబొడ్డున బంజారాహిల్స్‌లో మోమోస్, మయోనైజ్ తిని మహిళ మృతిచెందడం, 50 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడం దాని ఫలితమేననే విమర్శలు వెల్లువెత్తగా..ఈ వ్యవహారం ప్రజారోగ్య భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**లక్షల్లో విక్రయ కేంద్రాలు..**

ఉరుకులపరుగుల జీవితంలో ఎక్కువగా బయటి ఆహారంపై ఆధారపడుతుండడంతో ఇటీవలి కాలంలో రాజధానితోపాటు, రాష్ట్రవ్యాప్తంగా రెస్టారెంట్లు, ఫుడ్‌ట్రక్‌లు, చిరుతిళ్ల విక్రయశాలలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. హైదరాబాద్‌లోనే దాదాపు 70 వేలకు పైగా ఆహార విక్రయ కేంద్రాలు ఉంటాయని అంచనా. ఇవి కాకుండా చిరుతిళ్లు అమ్మే తోపుడు బండ్లు, ఫుడ్‌ట్రక్‌లు మరో 20 వేల వరకు ఉంటాయని సమాచారం. అధికారికంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆహార భద్రతాధికారులు(ఎఫ్ఎస్‌వో)ఈ ఏడాదిలో ఇప్పటివరకు జారీ చేసిన లైసెన్సులు 16,274 మాత్రమే కావడం గమనార్హం. దాదాపు కోటిన్నర జనాభా, సుమారు 90 వేల ఆహార విక్రయ కేంద్రాలున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నది కేవలం 21 మంది ఎఫ్ఎస్‌వోలు మాత్రమే. క్రమపద్ధతిలో హోటళ్ల తనిఖీ చేపడితే అన్నింటినీ తనిఖీ చేయడానికి వీరికి ఏళ్ల సమయం తీసుకుంటుంది. ఆహార పరిరక్షణ విభాగం కింద జిల్లాల పరిధిలో తనిఖీల కోసం 32 సర్కిళ్లు, గ్రేటర్ హైదరాబాద్‌లో 30 సర్కిళ్లు ఉన్నాయి. రాజధాని పరిధిలో ఆహార కల్తీని జీహెచ్‌ఎంసీ ప్రజారోగ్య విభాగం పర్యవేక్షిస్తోంది.

మొత్తంగా రాష్ట్రంలోని 62 సర్కిళ్ల పరిధిలో లక్షల సంఖ్యలో ఉన్న ఆహార కేంద్రాల తనిఖీకి ఉన్న అధికారుల సంఖ్య 76 మాత్రమే కావడం గమనార్హం.

**అనేక జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ అధికారులే..**

వాస్తవంగా ప్రతి ఉమ్మడి జిల్లాలో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. వీరందరినీ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పర్యవేక్షించాలి. అనేక జిల్లాల్లో ఇన్‌ఛార్జులే పర్యవేక్షిస్తున్నారు. ఉదాహరణకు వరంగల్ జిల్లా అధికారి జనగామకు ఇన్‌ఛార్జ్‌గా ఉండగా, హనుమకొండను చూసే అధికారే ములుగు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక వారి పరిధిలో సిబ్బంది, వాహనాల కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా ఒక్కో సర్కిల్ పరిధిలోని అధికారి నెలలో కనీసం 30 నుంచి 35 నమూనాలు సేకరించాలనే నిబంధన ఆచరణ సాధ్యం కావడం లేదు. ఆహార కల్తీలపై వచ్చే ఫిర్యాదులను పర్యవేక్షించే వ్యవస్థ, యంత్రాంగం అసలే లేదు. ఈ పరిస్థితుల్లో నిఘా, తనిఖీలు అటకెక్కడంతో దుకాణదారులు కల్తీ నూనెల వినియోగం, నాణ్యత లేని, కాలం చెల్లిన ఆహార పదార్థాల వాడకంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

- ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న ఆహార పదార్థాల విక్రేతలు
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న సామాన్యులు
- జీహెచ్ఎంసీ పరిధిలో 21 మంది ఎఫ్ఎస్‌వోలే
- పరిశీలన కరవై.. హోటళ్లు, రెస్టారెంట్ల ఇష్టారాజ్యం

**టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో వెలుగులోకి**

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆహార కల్తీపై ఫిర్యాదులు పెరగడంతో ఉన్నతాధికారులు రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశారు.

## దీపావళి వేడుకలు అయోధ్య సిద్ధం

**అయోధ్య:** దీపావళి వేడుకలకు పవిత్ర పుణ్యక్షేత్రం అయోధ్య నగరం ముస్తాబవుతోంది. ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఏటా దీపావళి పర్వదినానికి ముందు రోజు అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. అయితే ఈ ఏడాది 28 లక్షల దీపాలతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని యూపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే అక్టోబర్ 30న జరిగే దీపోత్సవ్ వేడుకలకు అయోధ్యా నగరి ముస్తాబవుతోంది. సరయూ నదీ తీరంలో దీపోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది వాలంటీర్లు ఈ దీపోత్సవం కార్యక్రమంలో భాగం కానున్నారు. ఇక రామ మందిరం నిర్మాణం తర్వాత తొలి సారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని యూపీ సర్కార్ భావిస్తోంది. ఇందులో భాగంగానే రామ మందిర సముదాయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరి స్తున్నారు. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. సరయూ హారతి ఇస్తారు. అనంతరం నది ఒడ్డున దీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ దీపాలను లెక్కించనున్నారు. ఈ దీపోత్సవానికి అన్ని శాఖల మంత్రులు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నారు. కార్యక్రమం అనంతరం లేజర్ షో ఏర్పాటు చేశారు.

## ఆరురోజులు తరువాత మెరుగుపడిన గాలిలో నాణ్యత

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో వరుసగా ఆరు రోజుల తర్వాత మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కాస్త మెరుగుపడింది. అయినప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు దేశరాజధాని ఢిల్లీలో ఏక్యూఐ 272గా నమోదైంది. అత్యధికంగా ముండకా ప్రాంతంలో ఏక్యూఐ 327 తో అధ్వాన స్థితికి చేరినట్లు తెలిపింది. ఇక ఆనంద్ విహార్‌లో 318, అయా నగర్‌లో 313, వజీర్‌పూర్‌లో 307, పట్‌పర్ గంజ్‌లో 296, ఆర్కేపురంలో 295, రోహిణి ప్రాంతంలో 287, 2 లో 265, ఐటీవో ప్రాంతంలో 261, లోధీ రోడ్డులో 255, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 247, అరబిందో మార్గ్‌లో 240గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0–100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100–200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200–300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300–400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400–500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

కాగా, ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల నుంచిదేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

# ఆస్తుల పంపకం జరగనే లేదు

**అమరావతి:** దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తులు పంచారన్నది అవాస్తవమని ఆయన భార్య వైఎస్ విజయమ్మ తేల్చిచెప్పారు.తాను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగ కూడనివి అన్ని తన ముందే జరిగిపోతున్నాయని ఆమె ఆవేదన చెందారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి ఎన్నో అసత్యాలు చెప్పారని అన్నారు. ఈ మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులకు ఆయన సతీమణి విజయమ్మ బహిరంగ లేఖ రాశారు. అబద్దాల పరంపర కొనసాగుతుందని చెప్పారు. జగన్, షర్మిల పేరిట వైఎస్ కొన్ని ఆస్తులు పెట్టారని తేల్చిచెప్పారు. ఇది ముమ్మాటికీ ఆస్తులు
పంపకం కాదని అన్నారు. షర్మిలకు వైఎస్సార్ ఆస్తులు ఇచ్చారని లిస్టు చదివారు. అలాగే జగన్ పేరిట పెట్టిన ఆస్తుల జాబితా కూడా చదివి ఉండాల్సింది. ఆడిటర్‌గా ఉన్న విజయసాయిరెడ్డికి అన్నీ తెలుసు. ఇంటి బంధువుగా ఎంవోయూపై వైవీసుబ్బారెడ్డి సంతకం చేశారు. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం బాధ కలిగించింది. అబద్దాల పరంపర కొనసాగకుండా ఉండేందుకే నిజం చెబుతున్నా. అమ్మగా నాకు ఇద్దరు సమానమే.. అలాగే వైఎస్సార్ మాట కూడా ముఖ్యమే. ఆస్తులు ఇద్దరు బిడ్డలకు సమానం అనేది నిజం. నలుగురు పిల్లలకు ఆస్తులు సమానంగా ఉండాలన్నది వైఎస్సార్ ఆజ్ఞ. బాధ్యత గల కొడుకుగా జగన్ ఆస్తులను సంరక్షించాలి. ఆ మేరకు వైఎస్సార్ చివరి రోజుల్లో ఆయనకు జగన్ మాట ఇచ్చారు. నాన్న నీ తర్వాత పాప మేలు కోరే వారిలో నేనే మొదటివాడిని అని.. వైఎస్సార్‌కు జగన్ మాట ఇవ్వడం కూడా నిజం. ఈ విషయం 'నాలో నాతో వైఎస్సార్' పుస్తకంలో ఎప్పుడో రాశానని విజయమ్మ స్పష్టం చేశారు. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే ఆస్తులు ఇద్దరికీ సమానమనేది నిజం. అయితే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. తల్లిగా అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం నా విధి, ధర్మం. ఇంట్లో ఒకబిడ్డకు ఇంకోబిడ్డ అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం కష్టం. హక్కు ఉంది కాబట్టే పాప షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. పాపకు హక్కు ఉంది కాబట్టే ఎంవోయూ రాసుకున్నారు. ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ వందశాతం.. ఎంవోయూలో లేని యలహంక ప్రాపర్టీ వందశాతం వెంటనే ఇస్తానని.. జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. వైఎస్సార్ ఉన్నప్పుడు ఆస్తులు పంచలేదు.. అందరం కలిసే ఉన్నాం. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని వివరించారు. అన్నీ తెలిసీ ఇప్పుడు విజయసాయిరెడ్డి అవాస్తవాలు మాట్లాడారు. వీటన్నింటికీ అప్పుడు.. ఇప్పుడూ నేనే సాక్షిని. అటాచ్‌మెంట్‌లోలేని ఆస్తుల్లోనూ పాపకు అన్యాయం జరిగింది. రాజకీయాల్లో జగన్ చెప్పినట్టే పాప చేసింది. ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దని అందరినీ కోరుతున్నానని విజయమ్మ తన లేఖలో వెల్లడించారు.

# ఏపీని నేరాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారు

**అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో చంద్రబాబు విధ్వంసకర, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్) వేదికగా చంద్రబాబు పాలనపై విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్ర స్థానంలో నిలబెట్టారని విజయసాయిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రాన్ని హరిత ఆంధ్రప్రదేశ్‌గా, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా, విద్యా ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దారని చెప్పారు. కానీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నేరాంధ్రప్రదేశ్, మద్యాంధ్రప్రదేశ్, అనారోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారని మండిపడ్డారు. “చంద్రబాబు సంపద సృష్టి” లో భాగంగా గ్రామాల్లో మద్యం దుకాణాల కోసం జనాభా ప్రాతిపదికన ధర నిర్ణయం చేస్తున్నారని విజయసాయిరెడ్డి అన్నారు. అధిక మొత్తం వెచ్చించి మద్యం దుకాణాలను దక్కించుకున్న టీడీపీ సిండికేట్ వ్యాపారులు గ్రామాలలో బెల్ట్ షాపులు లైసెన్స్ ఇచ్చేస్తున్నారని అన్నారు. బెల్ట్ షాపుల కోసం జనాభా.. మద్యం విక్రయాల.. స్థాయిని బట్టి రెండు లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో స్థానిక టీడీపీ నాయకులే మొత్తం ప్రక్రియలో చక్రం తిప్పుతున్నారని అన్నారు. ఎక్సైజ్ అధికారులు అటువైపు చూడకుండా.. దరిదాపుల్లో మరో బెల్ట్ షాపు ఏర్పడకుండా. సిండికేట్ వ్యాపారులే అన్నీ చూసుకుంటున్నారని అన్నారు. అందుకే ఈ టీడీపీ ప్రభుత్వాన్ని దొంగ ప్రభుత్వం.. దోపిడీ ప్రభుత్వం అని మండిపడ్డారు.

## ఏ ఒక్కరూ డయేరియాతో మరణించకూడదు

**విజయనగరం:** విజయనగరం జిల్లాలో ఇకపై డయేరియాతో ఏ ఒక్కరూ మరణించ కూడదని, అటువంటి మరణాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను హెచ్చరించారు. డయేరియా ప్రస్తుతం అదుపులోకి వచ్చిందని, మరణాలపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. డయేరియా విజృంభించి పలువురు మృతి చెందిన నేపథ్యంలో మంత్రి అనిత రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి గుర్ల గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. కాలువలను, తాగునీటి పైప్ లైన్లను, పారిశుధ్యాన్ని పరిశీలించారు. భూగర్భ జలాల కలుషితం గురించి ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో సమీక్షించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలం అనగానే డయేరియా, సీజనల్ వ్యాధులు సాధారణంగా వస్తాయని , ముందస్తు చర్యలతో వాటిని నివారించాలని తెలిపారు. వచ్చే 10 రోజులు అన్ని వాటర్ ట్యాంక్ లను శుభ్రపరచి, క్లోరినేషన్ చేయాలని తెలిపారు.గుర్లలో డయేరియా వచ్చిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. నీటి బావులు, చేతి బోర్లను వాడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం వలనే ఈ రోజు ఈ దుస్థితి వచ్చిందని, డ్రైనేజ్ పై నుండి, పక్క నుండి వాటర్ పైప్‌లు
వేశారని, అందుకే నీరు కలుషితమైందని తెలిపారు. చెత్త మీద పన్ను వేసి, ఎక్కడ చెత్త అక్కడ వదిలేశారన్నారు. జగన్ శవ రాజకీయాలు మాట్లాడుతున్నారని, ఆయన ముఖ్యమంత్రి హయాంలో ఉన్న కాలంలో ఆల్లగడ్డ, కృష్ణా, నెల్లూరు , చిత్తూరు, కర్నూలు వంటి జిల్లాల్లో చాలా మంది డయేరియాతో చనిపోయారని, ఏ రోజూ వారిని పరామర్శ చేయడానికి వెళ్ల లేదని అన్నారు . ఈ రోజు రాజకీయంగా బురద జల్లాలని చూస్తున్నారని విమర్శించారు. జగన్ నష్ట పరిహారం ప్రకటిస్తున్నారుగాని ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ నిర్వీర్యం అయిందని అనడం సరైనది కాదని, ఆయన కేవలం ఎమ్మెల్యేమాత్రమేనని అయినా జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఇస్తున్నామని తెలిపారు. జగన్ అమ్మ వద్దు–ఆస్తి ముద్దు అంటూ వ్యవహరిస్తున్నారని, తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని వాడు, రాష్ట్ర ప్రజలకు ఏమి విలువ ఇస్తాడని అన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు ఆయన తరుపున బయట పాదయాత్ర చేసిన ఏకైక మహిళ షర్మిలన్నారు. సొంత బాబాయిని చంపేసి, సొంత చెల్లితో రాజకీయం చేశాడని విమర్శించారు. అవినాష్ రెడ్డి, భారతి రెడ్డి, తన గురించి మాట్లొడద్దని షర్మిలను భయ పెడుతున్నాడని అన్నారు. రాజకీయాలకు పనికి రానీ ఏకైక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. తాము డైవర్షన్ రాజకీయాలు చేయడం లేదని, అధికారంలో ఉన్న తమకు ఆ అవసరం లేదని అన్నారు.

# దీపావళి ముందు జన్వాడలో సారాబుడ్లు



**హైదరాబాద్:** దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారు. కానీ, జన్వాడ ఫామ్‌హౌస్‌లో మాత్రం సారాబుడ్లు బయటికొచ్చాయి. అనధికార విదేశీ మద్యంతో కేటీఆర్ దీపావళి జరుపుకొంటున్నారా? జన్వాడ ఫామ్‌హౌస్‌పై భారాస కట్టుకథలు హాస్యాస్పదం. ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలి..అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల విందుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మంగళవారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. మాకు దీపావళి అంటే చిచ్చు బుడ్లు.. వాళ్లకు మాత్రం సారా బుడ్లు' అని విమర్శించారు. దీపావళి దావత్ అలా చేస్తారని తమకు తెలియదని ఎద్దేవా చేశారు. ఏమీ చేయకపోతే రాజ్ పాకాల ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ ఎందుకు అడిగారని నిలదీశారు. ఇంటి దావత్‌లో క్యాసినో కాయిన్స్, విదేశీమద్యం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మూసీ పరివాహకంలో సమయం వచ్చినప్పుడు పాయాత్ర చేస్తా. అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా. భారాస అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేస్తోంది. ఎంతో ఆలోచించి హైడ్రాను రంగంలోకి దించాం. హైడ్రాపై దేశమంతా తెలిసేలా భారాస ప్రచారం చేసింది. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదు.. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చింది.
సినిమాల్లో రాజమౌళి, వర్మ.. ఇద్దరిది వేర్వేరు స్టయిల్. రాజకీయాల్లో నా స్టైల్ నాది.. కేటీఆర్ స్టైల్ కేటీఆర్‌ది. రాజకీయంగా కేసీఆర్ పనైపోయింది. రూ.7.50 లక్షల కోట్ల అప్పులు కేసీఆర్ మిగిల్చి వెళ్లారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలు ఉన్నవి మాత్రమే ఆగాయి. 10 నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. టీజీపీఎస్సీ నియామకాల్లో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే. నాది చిన్నవయస్సు.. రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉంది. అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను. అందరి విషయం
లోనూ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విచారణ విషయంలో కక్షసాధింపు ఉండదని తేల్చిచెప్పారు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. రాజకీయంగా నష్టం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరతామని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీపై ముందడుగే.. వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయం తీసుకునే ముందే వెయ్యిసార్లు ఆలోచిస్తామని అన్నారు. నిర్ణయం తీసుకున్నాక వెనక్కి తగ్గేదే లేదని తేల్చిచెప్పారు. నవంబర్ 1వ తేదీన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు పనులు మొదలు పెడుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబరులో ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి ఇబ్బంది అయితే మంత్రులు, అధికారులను కలిసి చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు పిలుస్తాం. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజాప్రతినిధులను పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపాను. ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగింది. మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని సిఎం రేవంత్
వివరించారు. మూసీ కోసం భూములిచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తాం. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోం. .బాపూఘాట్ దగ్గర బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తామని తెలిపారు. బాపూఘాట్ దగ్గర అభివృద్ధి కోసం ఆర్మీ స్థలం అడిగామని చెప్పారు.15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు వేస్తామని తెలిపారు. మూసీ వెంట అంతర్జాతీయ వర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్..రీక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను తెచ్చి గండిపేటలో పోస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ట్రంక్ లైన్ కోసం నవంబర్ మొదటి వారంలో టెండర్లు పిలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టును ఎన్జీవోలు వ్యతిరేకిస్తే అర్థం ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావట్లేదు. కేటీఆర్ ప్రపంచస్థాయి మేధావిని అనుకుంటారు. మూసీని బాగు చేసే అంశంలో కేటీఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? ఈ ప్రాజెక్టుపై కేటీఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నా. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల తమ ప్రతిపాదనలు తెలపాలి. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది. 55 కి.మీ మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుతనగరం ఆవిష్కృతమవుతుందని వివరించారు. ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న నా కల నెరవేరింది. ముఖ్యమంత్రి పదవి కంటే పెద్ద కలలు నాకు వేరే ఏమీ లేవు...అందువల్ల వచ్చిన అవకాశంతో మంచి చేయాలన్న సంకల్పంతో ఉందుకు సాగుతున్నామని అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. నేను రుణమాఫీ చేశా. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. ఫీజు రీయింబర్స్ మెంట్ చేశాం అని అన్నారు.

# ఎనుముల కాదు..ఎగవేతల రేవంత్ రెడ్డి

**వనపర్తి:** నాపై ఎన్ని కేసులు పెట్టినా.. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ముఖ్యమంత్రిని ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుస్తానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. కొత్త పథకాలు రాలేదని.. పథకాలు బంద్ పెడుతున్నడని విమర్శించారు. బతుకమ్మ చీరెలు లేవు.. కేసీఆర్ కిట్లు లేవు.. చెరువుల్లో చేప పిల్లలు లేవు.. బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంది కనుక ఆ మాత్రం అయినా చేస్తున్నారన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలు ఇచ్చారని.. ఒక్కటైనా అమలు అవుతుందా? అని ప్రశ్నించారు. అయితే, దేవుడి మీద ఒట్లు అడిగితే తిట్లు అంటూ విమర్శలు గుప్పించారు. తిట్లతో పాటు కేసులు కూడా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అంటేనే
పోరాటాల గడ్డ, చంద్రబాబు, వైఎస్ మీద పోరాటం చేసినోళ్లమని గుర్తు చేశారు. వనపర్తిలో నిర్వహించిన రైతాంగ, ప్రజా నిరసన సదస్సులో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదివేల మంది స్వచ్ఛందంగా తరలిరావడం చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద రైతులు ఎంత ఆగ్రహంగా ఉన్నారనే దానికి నిదర్శనమన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా అన్నడు చెయ్యలేదని.. పార్లమెంట్ ఎన్నికల్లో పంద్రాగస్టు వరకు చేస్తామని మాట తప్పారన్నారు. ఈయన చెబితే నమ్మరని దేవుళ్ల మీద ఒట్లు వేసిండని.. కురుమూర్తి, జోగులాంబ అమ్మవారు, లక్ష్మీనరసింహస్వామిపై ఒట్లు వేసి మాట తప్పారని హరీష్ రావు మండిపడ్డారు. రూ.45వేలకోట్లని.. రూ.29వేలకోట్లు అని.. రూ.17వేల కోట్లు చేసినట్లుగా ప్రచారం చేశారన్నారు. సగం మందికి సైతం రుణమాఫీ కాలేదన్నారు. కేసీఆర్ అందరికీ రైతుబంధు ఇస్తే నిబంధనలు పెట్టి రుణమాఫీ ఎగవేశారన్నారు. పాలకుడు దేవుళ్లపై ఒట్లుపెట్టి మాట తప్పితే రాష్ట్రానికి అరిష్టం అవుతుందని తాను దేవుడి దగ్గరకి వెళ్లానన్నారు. ప్రజల్ని కాపాడు.. పాపాత్ముడిని క్షమించమని వేడుకున్నానన్నారు. దానికి కూడా నా మీద కేసులు పెట్టారన్నారు. మోసం చేసినవు నీ పేరు ఏనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నానన్నారు. పది నెలలు అయ్యింది మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయలేదు అంటే బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టారన్నారు. బిడ్డా రేవంత్ రెడ్డి నువ్వు నా మీద ఎన్ని కేసులు పెట్టినా.. నీ హామీలు అమలు చేసేదాకా నిన్ను ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి అని పిలుస్తానని స్పష్టం చేశారు. రైతుబంధు, రుణమాఫీ, బీమా పేరిట రూ.1.50లక్షల కోట్లు కేసీఆర్ రైతులకు ఇచ్చిండు కానీ రేవంత్ రెడ్డి రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేసిండు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి, సన్నాలకు అని మాట తప్పాడు డెడ్‌లైన్, పేపర్ హెడ్‌లైన్ మారినయన్నారు.
గతంలో వనపర్తిని వలసల వనపర్తి అనేవారని.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక బుద్దారం బ్రాంచ్ కెనాల్, ఘనపురం తవ్వించామన్నారు. కేసీఆర్‌తో వలసల వనపర్తిని వరికోతల వనపర్తి అయ్యిందన్నారు. ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజ్ తెచ్చారన్నారు. వనపర్తిని సరస్వతి నిలయం చేసింది నిరంజన్ రెడ్డేనన్నారు. జీవో29 తెచ్చి ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నడు అన్యాయం అంటే పిల్లల ఈపులు పగల కొడుతున్నడని అన్నారు. ముఖ్యమంత్రిగా సమస్యలు పరిష్కరించడంలో ఫెయిల్ అయ్యారని.. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వడం లేదన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నారు. అన్ని వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. కరెంట్ బిల్లులు పెంచవద్దని కొట్లడితే పెంచలేదని అన్నారు. బీఆర్ఎస్ పోరాటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ మెడలు వంచి రైతుబంధు ఇప్పిస్తానన్నారు. మహిళలకి 2500 మహాలక్ష్మి, ఆటో డ్రైవర్లకు, వ్యవసాయ కూలీలకు చెప్పినట్లు హామీలు ఇవ్వాలన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. తెలంగాణ భవన్‌లో లీగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. 480 మందికి స్టే తెచ్చామన్నారు. అక్రమ కేసులు పెడుతూ కొందరు పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని.. వారి పేర్లు డైరీల్లో రాసిపెడుతున్నామని హరీష్‌రావు హెచ్చరిం చారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు వదిలిపెట్టమని హెచ్చరించారు. ఢిల్లీకి మూటలు పంపేందుకు..లక్షా 50 వేల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణకు డబ్బులిచ్చే సీఎం రేవంత్‌రెడ్డికు రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు నిధులు లేవా అని హరీష్‌రావు నిలదీశారు. పత్తి రైతులకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ ప్రభుత్వం మెడలు వంచుతామని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల బాకీ పడిందని అన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక
సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు.



# ఫ్యూచర్ సిటీకి వేగంగా కసరత్తు

**పలు రకాలుగా యంగ్ ఇండియా నమూనాలు**

**సిఎం రేవంత్ రెడ్డి కసరత్తు**



**హైదరాబాద్:** ఫ్యూటర్ సిటీ పనులకు వేగంగా అడుగులు పడుతున్నాయి.
భూసేకరణ,రహదారుల నిర్మణానికి సంబంధించి ప్రణాళికలు సిద్దం అవుతున్నాయి. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన హంగులతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని నిర్మాణానికి మెగా సంస్థ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం కూడా జరిగింది. ఈ క్రమంలో ఇక పనులు కూడా వేగం పుంజుకోనున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని రూపొందించారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మెగా కంపెనీ రావడంతో నిర్మాణాలకు సంబంధించి పలు నమూనాలను సర్కారు తయారు చేయించింది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో యూనివర్సిటీ క్యాంపస్‌ను దేశంలో అందరి దృష్టిని ఆకర్షించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా ఆర్కిటెక్ట్ ఇంజినీర్లకు, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మేఘా కంపెనీ ప్రతినిధులకు సూచించారు. నవంబరు 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎనిమిది నుంచి పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణానికి మేఘా కంపెనీ ఇటీవలే రూ.200 కోట్ల విరాళం అందించింది. అదానీ
కంపెనీ సైతం రూ.100 కోట్ల విరాళం అందజేసింది. వీటితోపాటు వివిధ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యం, విరాళాల ద్వారా సమీకరించిన నిధులతో కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం జమ చేస్తోంది. వీటితో యూనివర్సిటీ నిర్వహణకు భవిష్యత్తులో ఆర్థికపరమైన ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో దాదాపు 57 ఎకరాల విస్తీర్ణంలోని యూనివర్సిటీ స్థలంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌తోపాటు.. అకడమిక్ బ్లాక్, వర్క్ షాప్‌లు, బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు, డైనింగ్ హాల్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. వీటితోపాటు ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లు రూపొందించారు. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం, పచ్చదనం ఉండేలా నమూనాలు తయారు చేయించారు. ఆరు వేల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌లో నిర్మాణాలను చేపట్టనుంది. అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చనున్నారు.వీటితోపాటు విద్యుత్తు వినియోగం తగ్గించేలా.. ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో గాలి, వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లు రూపొందించారు. స్కిల్స్ యూనివర్సిటీకి శంషాబాద్ విమానాశ్రయంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సులభంగా చేరుకునేందుకు వీలుగా కొత్త రహదారి నిర్మించాలని టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, రహదారులు భవనాల శాఖల అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) ఎగ్జిట్ 13 రావిర్యాల నుంచి కొంగరకలాన్ మీదుగా మీర్‌ఖాన్‌పేట్.. అక్కడి నుంచి
ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వద్ద రీజనల్ రింగ్‌రోడ్‌ని అనుసంధానం చేస్తూ 40 కిలోమీటర్ల రహదారిని అందుబాటులోకి తీసుకుని రానున్నారు. ఈ రహదారిని ఓఆర్ఆర్‌లా 200 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు.

# శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారు.





## తెలంగాణ బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడి

## నిజామాబాద్ లో బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ.

## నవంబర్ మొదటి వారం నుండి రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 29

ప్రజలు వ్యక్తపరిచిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా వెల్లడయ్యే అంశాలను పరిగణలోకి తీసుకుని స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలతో కూడిన నివేదికను సమర్పిస్తుందని కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ఈ నివేదిక పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో ఉండేవిధంగా కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థనలు స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. బీసీ సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు



అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. బహిరంగ విచారణ ప్రక్రియకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

ఈ సందర్భంగా కమిషన్ విధివిధానాల గురించి చైర్మన్ జి.నిరంజన్ క్లుప్తంగా వివరించారు. స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యి ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుండి వచ్చే నిధులు నిలిచిపోయాయని అన్నారు. దీంతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సమాయత్తం అవుతోందని, ఇందులో భాగంగా స్థానిక సంస్థలలో ఆయా వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అధ్యయనం కోసం బీ.సీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తోందని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి రాష్ట్రంలో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు వెల్లడి కానున్నాయని, రిజర్వేషన్ల ఖరారుకు సర్వే అంశాలు దోహదపడతాయని ఆశాభావం వెలిబుచ్చారు. బీహార్ రాష్ట్రంలో 62 శాతం బీసీల జనాభా ఉందని, దీని ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయాలని అక్కడి ప్రభుత్వం భావించగా, ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరణ తెలిపిందని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో సైతం సర్వే నిర్వహించినప్పటికీ గత దశాబ్ద కాలంగా నివేదికను వెల్లడించని పరిస్థితి నెలకొని ఉందన్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారుకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషన్ గట్టి కసరత్తులు చేస్తోందని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సర్వేను పూర్తి చేస్తామని, ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరిస్తూ పూర్తి సమాచారంతో కూడిన వివరాలను నమోదు చేయించాలని, ఈ దిశగా ప్రజలను చైతన్యపరచాలని కుల సంఘాల ప్రతినిధులను చైర్మన్ కోరారు. నవంబర్ 13 వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్ లైన్ లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్ 09 లోగా ప్రభుత్వానికి, రాష్ట్ర హైకోర్టుకు నివేదిక అందజేస్తామని తెలిపారు. బహిరంగ విచారణ సందర్భంగా ముఖ్యంగా విద్య, సామజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణపై ప్రజలు తమ స్థితిగతులను వెల్లడిస్తూ, రిజర్వేషన్లు కోరుతున్నారని అన్నారు. కాగా, బహిరంగ విచారణలో నేరుగా కలువలేకపోయిన కుల సంఘాలు, ప్రజలు ఏవైనా సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే వచ్చే నెల నవంబర్ 13 వ తేదీ, సాయంత్రం 5.00 గంటల లోగా హైదరాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయం, ఖైరతాబాద్, జలమండలి, 4 వ అంతస్తులో నేరుగా కానీ, పోస్టు ద్వారా కూడా అభ్యర్థనలు పంపవచ్చని సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, తెలంగాణ బీసీ కమిషన్ కు విజ్ఞాపనలు సమర్పించేందుకు బహిరంగ విచారణకు హాజరయ్యే వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, నిర్దేశిత నమూనాలో వినతులు అందించేలా సహకరించేందుకు హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచామని అన్నారు. సామాజిక, ఆర్థిక విశ్లేషణకై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఎన్యూమరేటర్లను, సూపర్వైజర్లను గుర్తించడం జరిగిందని, మాస్టర్ ట్రైనర్లచే వారికి సర్వే అంశాలపై శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క కుటుంబం సైతం మినహాయించబడకుండా ప్రతి ఒక్కరి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాలను సమగ్రంగా సేకరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.

కాగా, బహిరంగ విచారణ కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమిషన్ బృందానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు, వివిధ సంఘాల ప్రతినిధులు కమిషన్ కు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కమిషన్ బహిరంగ విచారణ ప్రక్రియలో స్పెషల్ ఆఫీసర్ సతీష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణపై కఠినంగా ఉండాలి.



## సమన్విత, కౌసల్య ఆసుపత్రులను శాశ్వతంగా సీజ్ చేయాలి.

## సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్.

## జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం.

వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 29

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమన్విత, కౌసల్య ఆసుపత్రులను శాశ్వతంగా సీజ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కు సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సమన్విత ఆసుపత్రిలో నిరంతరం లింగ నిర్ధారణ పరీక్షలు చట్టానికి వ్యతిరేకంగా కొనసాగుతున్నాయని, గతంలో చర్యలు తీసుకుని మళ్లీ ఆసుపత్రి నడపడానికి అనుమతి ఇవ్వడంతో చట్టం పట్ల విలువ, గౌరవం అనేది లేకుండా పోయిందని అన్నారు. చట్టాన్ని గౌరవించని ఈ ఆసుపత్రిని శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుగా కొనసాగిస్తున్న అన్ని ప్రైవేట్ ఆసుపత్రిలపై ఒక్కసారిగా దాడులు చేసి జిల్లా యంత్రాంగం ఆస్పత్రి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులతోపాటు ఆస్పత్రులను సీజ్ చేయాలన్నారు. ఈ జిల్లాలో అనుమతులకు అనుగుణంగా లేని ఆస్పత్రుల అనుమతులను రద్దు చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వెంకట్ గౌడ్, మోతీరాం నాయక్, కొత్త నరసింహులు పాల్గొన్నారు.

# బిసి" జనాభా ప్రకారం రిజర్వేషన్ లు అమలు చేయాలి.

## - బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్.




వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 29:

తెలంగాణ సమాజంలో 93% ఉన్న బిసి, ఎస్సీ, ఎస్టీ, మత మైనారిటీలు, అగ్రకులపేదలైన బహుజన ప్రజలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా పంపిణీ చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు, భవనాల అతిథి గృహంలో మంగళవారం నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా బిఎల్ఎఫ్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల జనగణనతో బిసి కులాల జనాభా దామాషా ప్రకారం పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు ప్రాతినిద్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

చట్టసభల్లో ప్రాతినిద్యం లేని కొన్ని బిసి కులాలు ఎస్సీ, ఎస్టీల కంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతికంగా అత్యంత వెనుక బాట తనాన్ని అనుభవిస్తున్నారని, దానికి కారణం ఇప్పటి వరకు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపి టీఆర్ఎస్, టిడిపి, వైసిపి తదితర ఆధిపత్య రాజకీయ పార్టీలేనని విమర్శించారు. బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ లు దండి వెంకట్, వనం సుధాకర్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ధి రాములు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు , ఐదు సంవత్సరాలకుగాను లక్ష కోట్ల రూపాయలను బిసి కులాల ఆర్థికాభివృద్ధి కోసం కేటాయిస్తామని, ప్రభుత్వ వివిధ కాంట్రాక్ట్ పనుల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. అదేవిధంగా కుల జనగణన ద్వారా బిసి కులాలకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి చట్టసభలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకురాలు సబ్బని లత, మేత్రి రాజశేఖర్, మారోజు సునిల్ కుమార్,
బిఎల్ఎఫ్ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, వడ్ల సాయి కృష్ణ, జబ్బార్ నాయక్, దండు జ్యోతి, నాగరాపు ఎల్లయ్య, బి.జగదీష్, మోషిన్, చంద్ర గౌడ్, జి. శ్రీమాన్, ఎస్. డి. సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో "ఫీజు దీక్ష".

## పెండింగ్ లో ఉన్న 8,300 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు డిమాండ్.

వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 29




పెండింగ్ లో ఉన్న 8,300 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్ షిప్ లను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో "ఫీజు దీక్ష" కార్యక్రమం చేపట్టారు. ఈ దీక్షను ప్రముఖ న్యాయవాది క్యాతం సిద్ధిరాములు, టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు వేణుగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి కే. చంద్రశేఖర్, సిఐటియు నాయకులు వెంకట్ గౌడ్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్ షిప్ లు విడుదల చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సుమారు రాష్ట్రంలో 8300 కోట్ల రూపాయలు స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్ లను ప్రభుత్వం చెల్లించ లేకపోవడం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కాలేజీల చుట్టూ తిరిగాల్సి వస్తుందని అన్నారు. యాజమాన్యాలు కూడా కళాశాల నడుపుకోలేని పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల జీతాలు ఆపలేని రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థుల స్కాలర్ షిప్ లను ఎందుకు పెండింగ్ లో పెట్టిందో ప్రజలకు సమాధానం ఇవ్వాలని అన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. వెంటనే స్కాలర్ షిప్ లు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్ అజయ్ జిల్లా నాయకులు మణికంఠ, సమీర్, రాహుల్, నితిన్, సాయి, నవీన్, శివతేజ, సాయి, ప్రకాష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# బిఎల్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగ ఎల్లయ్య ఎన్నిక.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 29




బిఎల్ టీయూ అనుబంధ తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగరపు ఎల్లయ్య ఎన్నిక అయినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సిద్దిరాములు తెలిపారు.
నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ, నాగారపు ఎల్లయ్య గత ముప్పై సంవత్సారాలుగా సుదీర్ఘకాలంగా కార్మికోద్యమంలో పని చేస్తున్నడని అన్నారు. బహుజన కార్మిక వర్గ పోరాటాల అభివృద్ధి కోసం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం నాయకులు బి.జగదీష్ , యస్. డి. సయ్యద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి సర్వే పక్కగా నిర్వహించాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 29:




సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించుటకు ప్రతీ ఇంటింటి సర్వే చేపట్టాలని, ఏ ఒక్క ఇల్లు కూడా తప్పి పోకుండా సర్వే చేయాలని అన్నారు. సర్వే కోసం ఎన్యుమరేటర్ లను నియమించాలని, వారికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎన్యుమరెటర్లకు అపాయింట్మెంట్ ఉత్తర్వులు జారీచేయాలని సూచించారు. ప్రభుత్వం జారీచేసిన ప్రశ్నావళి లోని అన్ని అంశములకు సంబంధించిన వివరాలు ఎన్యుమారెటర్లు సేకరించాలని తెలిపారు. ప్రతీ ఎన్యుమారెటర్ కు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మండల ప్రతేక అధికారులు ఎన్యుమరేషన్ పై పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఎన్యుమరేషన్ కు అవసరమైన సామాగ్రి సమకూర్చాలని తెలిపారు. మండల స్థాయిల్లో ఏన్యుమారెటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్వేను పకడ్బందీగా, పక్కగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సి. పి. ఒ. రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# చెరుకు పంటతో అధిక దిగుబడి.

## - బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, రుద్రూర్, అక్టోబర్ 29**

రైతులు చెరుకు పంటను పండిస్తే అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామంలో గల ఫుడ్ సైన్స్ కళాశాలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఫుడ్ సైన్స్ కళాశాలలో పండిస్తున్న చెరుకు పంటను ఆయన పరిశీలించారు.



అనంతరం కళాశాల శాస్త్రవేత్తలతో పలు రకాల పంటల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బాలాజీ నాయక్ చెరుకు, వరి పంటలలో రకాల గురించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రొజెక్టర్ తో చూపిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వరి పంటలతో పాటు చెరుకు పంటలను కూడా పండించాలని సూచించారు.




# గడుగు గంగాధర్‌కు బార్ అసోసియేషన్ సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 28**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులుగా నియమితులైన నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది గడుగు గంగాధర్ ను నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియే అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో అనేక పదవులు అధిరోహించాలని, ఉన్నత స్థాయిలోకి వెళ్లాలని, రాష్ట్ర రైతాంగానికి సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంపల్ సురేష్, పిల్లి శ్రీకాంత్, కిరణ్ కుమార్ గౌడ్, నరేందర్ రెడ్డి, బిట్ల రవి, నారాయణ, ఉదయ్ కృష్ణ, గణేష్ , వెంకటేష్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్పీ కానిస్టేబుల్స్ డిస్మిస్ ఎత్తివేయాలి.

## - అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 29:**

టీజీపీఎస్పీ కానిస్టేబుల్స్ డిస్మిస్, సస్పెండ్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ గుప్త డిమాండ్ చేశారు. గత కొద్ది రోజులుగా కానిస్టేబుల్స్ చేస్తున్న నిరసనలపై మంగళవారం ఎమ్మెల్యే స్పందించారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలిసులు రోడ్డెక్కి ధర్నాలకు దిగితే, వారి మానసిక క్షోభ అర్థం చేసుకాకుండా, ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం అన్యాయమని తెలిపారు. పునర్విభజన వల్ల తమకు అన్యాయం



జరుగుతుందని కుటుంబాలకు దూరం అవుతున్నామని, వారి భార్య పిల్లలు రోడ్డెక్కితే వారి వ్యక్తిగత జీవితాలను అర్థం చేసుకోకుండా 39 మంది కానిస్టేబుల్స్ ను సస్పెండ్ చేయడం, 10 మందిని డిస్మిస్ చేయడం అమానుషమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి టీజీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్స్ న్యాయపరమైన డిమాండ్స్ పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా సస్పెండ్ చేసిన 39 మందిని, డిస్మిస్ చేసిన 10 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ సూచించారు.

# భారీగా గంజాయి పట్టివేత

**అనకాపల్లి:** కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో 448 కేజీల గంజాయి, రెండు కేజీల లిక్విడ్ గంజాయిని జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ఓ లారీ, బొలెరో వాహనం, కారు, ద్విచక్రవాహనం, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన మత్తుపదార్థాల విలువ రూ.21లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తుని మీదుగా కేరళ రాష్ట్రానికి గంజాయి సరఫరా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి వి.మాడుగుల, కొత్తకోట సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఐదుగురు కేరళకి చెందిన వారి కాగా, ఒకరు చింతపల్లి వాసిగా పోలీసులు గుర్తించారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేసి ఈ కేసుతో సంబంధం ఉన్న మిగతా వారినీ అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా తెలిపారు.

# నీట్ పరీక్షలో ర్యాంకులు

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 29:**

నీట్ పరీక్షలో ర్యాంకులు సాధించి వివిధ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లను సాధించిన ఎస్ఆర్ విద్యార్థులను మంగళవారం యాజమాన్యం ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ ఎస్ఆర్ జూనియర్ కాలేజికి సంబంధించిన 8 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన కట్ల సహాయ, కట్ల సహజ, బాశెట్టి సన్నిహిత్, వడ్డె అర్చన, బాగుల తనుజ, దావానే సమైఖ్య, చితారి అక్షయ, జెట్టి సుదీప్తిలు ఉన్నారు. ఈ విద్యార్థులను ఎస్ఆర్ డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇంచార్జి శ్రీకాంత్, డీన్ ప్రదీప్, క్యాంపస్ ప్రిన్సిపాల్ హన్మంత్ రావు, దేవేందర్ రెడ్డి, నర్సింహా రెడ్డిలు సన్మానించారు. ఈ సందర్భంగా డీజీఎం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ బ్రాంచ్ కు చెందిన 8 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ కు



దీటుగా జాతీయ స్థాయి ఎంట్రెన్స్ లో ర్యాంకులు సాధించి మెడికల్ సీట్లు గ్రామీణప్రాంత విద్యార్థులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జి శ్రీకాంత్ మాట్లాడుతూ నీట్ లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి సీనియర్ లెక్చరర్లు, బెస్ట్ మెటీరియల్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శిలాజ ఇంధనాలతో పెనుముప్పు



**గ్లోబల్ వార్మింగ్‌కు ఇదే కారణం**

**ఆందోళనకరంగా ఢిల్లీ వాతావరణ కాలుష్యం**

న్యూఢిల్లీ: శిలాజ ఇంధనాల పెరుగుదలతో ప్రపంచానికి పెనుముప్పు తప్పదని ఓ నివేదిక తేల్చింది. బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడుతుండటంతో.. గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతుందని.. దీంతో లక్షలాది మందిప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంది. దీనికి సంబంధించిన విపరీత పరిణామాల కారణంగా అనేక రకాల నస్టాలరు చవిచూస్తున్నాం. భవిష్యత్తులో మరింత తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆ నివేదిక హెచ్చరించింది. ఒక్క భారత్‌లోనే 2 నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని ఓ నివేదిక ఇప్పటికే వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ వంటి పలు సంస్థలకు చెందిన నిపుణులు ఈ నివేదనకు రూపొందించారు. ఈ శతాబ్దం చివరి నాటికి గ్లోబల్ వార్మింగ్ 2.7 డిగ్రీల సెల్సియస్ పెరగనుందని నివేదిక తెలిపింది. ఈ శిలాజ ఇంధనాల వాడకం వల్ల ఏర్పడే కాలుష్యం కారణంగా.. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఆ నివేదిక వెల్లడించింది. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్య కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలని ప్రపంచ దేశాలకు సూచించారు. శిలాజ ఇంధనాల పెరుగుదలతో ఆహార భద్రత, అంటు వ్యాధుల వ్యాప్తి, అధిక ఉష్ణోగ్రతలు, విద్యుత్ సంక్షోభం, గాలి కాలుష్యం వంటివి పెరుగుతాయని హెచ్చరించింది.

మరణాల రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరించారు. శిలాజ ఇంధనాలకు రాయితీలు ఇవ్వడం తగ్గించాలని సూచించారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే వినాశనం తప్పదని చెప్పారు. మరోవైపు ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ మరోసారి పెరిగింది. పూర్ కేటగిరి నుంచి వెరీ పూర్ కేటగిరికి చేరింది. దీంతో గాలిలో నాణ్యత తగ్గింది. దీపావళి తరువాత నుంచి ఎయిర్ క్వాలిటి తగ్గుతందని అధికారులు చెబుతున్నారు. పొల్యూషన్ కారకాలు వాతావరణంలో పెరిగి పోయాయని వాతావరణ శాఖ అధికారులు అన్నారు. దేశరాజధాని ఢిల్లీలో వరుసగా ఆరు రోజుల తర్వాత మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కాస్త మెరుగుపడింది. అయినప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు దేశరాజధాని ఢిల్లీలో ఏక్యూఐ 272గా నమోదైంది. అత్యధికంగా ముండకా ప్రాంతంలో ఏక్యూఐ 327 తో అధ్వాన స్థితికి చేరినట్లు తెలిపింది. ఇక ఆనంద్ విహార్‌లో 318, అయా నగర్‌లో 313, వజీర్‌పూర్‌లో 307, పట్‌పర్ గంజ్‌లో 296, ఆర్కేపురంలో 295, రోహిణి ప్రాంతంలో 287, ఓఖ్లాఫేజ్ ? 2 లో 265, ఐటీవో ప్రాంతంలో 261, లోధీ రోడ్డులో 255, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 247, అరబిందో మార్గ్‌లో 240గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్
కంట్రోల్ బోర్డ్ తెలిపింది. ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల నుంచిదేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

# ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ గా సాయిబాబాగౌడ్.

## - నియామక పత్రం అందించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, అక్టోబర్ 29:**

ఆర్మూర్ మార్కెట్ కమిటికి నూతన పాలకవర్గంను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మెన్ గా సాయిబాబా గౌడ్, వైస్ చైర్మెన్ గా విట్టం జీవన్, డైరెక్టర్ లుగా చిన్న గంగారాం, చిన్న ఉషన్న, అజ్మీర పీర్ సింగ్, రవి కుమార్, అమ్రుత రావు, చంద్రశేఖర్ రెడ్డి, సయ్యద్ ఫయాజ్, మల్లారెడ్డి, పింజా ఉషారాణి, బూస మల్లయ్య, మునిరుద్దీన్, మత్యం సంతోష్ లతో కుడిన కార్యవర్గంను నియమాకం అయ్యారు. మార్కెట్ కమిటి చైర్మెన్ సాయిబాబా గౌడ్ కు బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ, ఈ భాధ్యతలు అప్పగించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ఇందుకు సహకరించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్చార్జి వినయ్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఏబీవీపీ ఆందోళన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 29:**

పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ శశిధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కాలర్ షిప్ అనేది ప్రభుత్వం పెట్టే భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అన్నారు. ఇకనైనా పెండింగ్ లో ఉన్న రూ. 7,800 కోట్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, నాయకులు ప్రవీణ్, అలంకార్, నాగరాజు, గణేశ్ పాల్గొన్నారు.



# శ్రీనివాస మంగాపురంలో పవిత్రోత్సవాలు

తిరుపతి: తిరుపతి శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర సమర్పణ చేశారు. స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణమండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయానం నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది.